క్లుప్తంగా

విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత

గుడివాడ టౌన్: విజయవాడ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న మహిళకు శనివారం పెన్షన్ పంపిణీ చేశారు. నాగవరప్పాడుకు చెందిన ఈటెల నాగమణి అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. డయాలసిస్ చేయించుకుంటున్న కారణంగా గుడివాడకు రాలేని పరిస్థితుల్లో క్లస్టర్‌కు చెందిన వలంటీరు పల్లిపాము కాంతమ్మ విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు.

జలజీవన మిషన్ పనులు ప్రారంభం



మండవల్లి: మండవల్లిలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించడం పట్ల ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు, టి అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. పనుల ప్రారంభంపై సంబంధిత అధికారులకు సర్పంచ్ మెండా ఝాన్సీ, కార్యదర్శి టి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన



పామర్రు: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పామర్రు నియోజకవర్గానికి స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు శనివారం స్థల పరిశీలన చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్లు వినయ్ ప్రసాద్, కృష్ణ కుమార్, మాథ్యూ అబ్రహాం, రవిశర్మ సభ్యులతో కూడిన ఫెజిబుల్ కమిటీ సభ్యులు పామర్రులోని పలు ప్రదేశాలను స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. స్థానిక హితమ్ స్కూల్లో ఫెజిబుల్ కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో హితమ్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



గుడివాడ టౌన్: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.బాల సుబ్రహ్మణ్యంను మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కేడీవీఎస్ శ్రీనివాస్, కొత్తా సుబ్బారావు, సయ్యద్ గఫార్, ఆర్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం


న్యాయమూర్తి పూర్ణిమ

గుడివాడ టౌన్: మహిళలకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎ. పూర్ణిమ అన్నారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్‌లోని అనంద్ ఫంక్షన్ హాల్లో మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అంకిత ఆర్గనైజేషన్, స్వాతి ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా సాధికారితపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంధ సేవా సంస్థలు కృషిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహ్మద్ రఫీ, సీహెచ్ కుటుంబరావు, డి.రాధాకృష్ణమూర్తి, స్వాతి ఆర్గనైజేషన్ అధికారి నవీన్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు

మొవ్వ: మొవ్వ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సీహెచ్ వీరాంజనేయప్రసాద్ అమలాపురం బదిలీ అయ్యారు. ఈ మేరకు తహసీల్దార్ దంపతులకు శనివారం రెవెన్యూ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేర్లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన రెవెన్యూ సిబ్బంది

మొవ్వ: విశాఖపట్నం జిల్లా చినగదిలి రూరల్ తహసీల్దార్ రమణయ్య దారుణ హత్యకు నిరసనగా శనివారం మొవ్వ తహసీల్దార్ కార్యలయంలో రెవెన్యూ సిబ్బంది నల్లబాడ్జీలతో విధులకు హాజరయ్యారు. యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు డీటీ సీహెచ్ గోపాలరావు, డీటీ రీ సర్వే కే శ్రీనివాసరావు, మండల సర్వేర్ ఏ కిషోర్, ఆర్ఐ ఈడే విజయలక్ష్మి, వీఆర్‌వోలు, వీఆర్ఏలు నల్ల బాడ్జీలతో నిరసన తెలిపి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిద్ధం సభకు స్వచ్ఛందంగా తరలిన అభిమానులు


కైకలూరు సీఎన్నార్ గార్డెన్ నుంచి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్


పార్టీ శ్రేణులతో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావం బహిరంగ సభ ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం నిర్వహించిన సిద్ధం సభకు పామర్రు మండలం నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు అభిమానులు సభకు బయలుదేరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు జై జగన్ అని నినాదాలు చేస్తూ ర్యాలీగా సభకు తరలివెళ్లారు. స్థానిక యలమర్రు రోడ్డులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ శ్రేణులు సభకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు టీ శ్రీనివాసరావు, నందిపు బేబి షాలినీ, కోఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్టు బోర్డు జిల్లా సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు కూసం పెద వెంకటరెడ్డి, సజ్జా సుబ్రమణ్యం, ఎస్ సాంబిరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరావు, శేషురెడ్డి, అభిమానులు ర్యాలీగా తరలి వెళ్లారు.

ఐదు మండలాలల నుంచి..

నియోజకవర్గంలోని ఐదు మండలాలల నుంచి సుమారు 10వేల మందికి పైగా పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు దెందులూరు సభకు తరలి వెళ్లారు. మార్గ మధ్యంలో వీరికి జంక్షన్‌కు సమీపంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ భోజనం ఏర్పాటు చేశారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: దెందులూరులో శనివారం జరిగిన సిద్ధం సభకు గుడివాడ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో తరలివెళ్లారు. గుడివాడ మండలంలో బస్సులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. నందివాడ మండలంలో బస్సులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ పెయ్యల ఆదాం జెండా ఊపి ప్రారంభించారు. గుడ్లవల్లేరు మండలంలో బస్సులను ఎంపీపీ కొడాలి సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. గుడివాడ పట్టణంలో బస్సులను వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్, ఎంపీపీ గద్దే పుష్పరాణి జెండా ఊపి ప్రారంభించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు తరలివెళ్లారు.

మండవల్లిలో..

మండవల్లి: దెందులూరులో శనివారం నిర్వహించిన సిద్ధం సభకు మండలంలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బస్‌లలో పార్టీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. సభకు వెళుతున్న వారి బస్‌లను మండవల్లిలో ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుడివాడ బాబీ, మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, సొసైటీ అధ్యక్షుడు గోశర్ధయాదవ్, మెండా సురేష్, రాణి పాల్గొన్నారు.

కైకలూరులో..

కై కలూరు: దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'సిద్ధం' సభకు కైకలూరు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. వివిధ మండలాల నుంచి వచ్చిన బస్సులకు ఏలూరురోడ్ సీన్నార్ గార్డెన్ వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) జెండా ఊపి ప్రారంభించారు. కైకలూరు నుంచి ముస్లిం యువత పెద్ద ఎత్తున బైక్ ర్యాలీపై సిద్ధం సభకు వెళ్లారు. మండవల్లి నుంచి తీన్‌మార్ డప్పులతో యువత వచ్చింది. కొల్లేరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు బస్సులలో వెళ్లారు. కార్యకర్తలకు డీఎన్నార్ ఫొటో కలిగిన టీ షర్ట్‌లు, పార్టీ జెండాలను పంపిణీ చేశారు. సీఎం కార్యక్రమానికి బస్సులలో వచ్చిన ప్రతి కార్యకర్త, నాయకులకు భోజనం, తాగునీటి సౌకర్యాలను ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు దూలం వినయ్, శ్యామ్ పర్యవేక్షించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ఏలూరు జిల్లా దెందులూరులో శనవారం నిర్వహించిన సిద్ధం కార్యక్రమానికి గుడివాడ నుంచి శనివారం వేలాదిగా కార్యకర్తలు తరలివెళ్లారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల నుంచి గుడివాడ అర్బన్, రూరల్, గుడ్లవల్లేరు, నందివాడ మండలాలకు చెందిన వేలాదిమంది కార్యకర్తలు బస్సులు, కార్లు, బైక్‌లపై తరలి వెళ్లారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో కార్యకర్తలకు కళాశాల ప్రాంగణంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు రామ్ ప్రసాద్, వల్లూరుపల్లి సుధాకర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్‌లు వీరిశెట్టి నరసింహరావు, మాదాసు వెంకట లక్ష్మీకుమారి, అల్లం సూర్యప్రభ, నాయకులు చుండూరి శేఖర్, వెంపల అప్పారావు పాల్గొన్నారు.

మొవ్వ: దెందులూరులో శనివారం సిద్ధం మహా సభకు మొవ్వ మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నాయకత్వంలో తరలివెళ్లారు. ఎంపీపీ కొండేటి ఇందిర నేతృత్వంలో నాయకులు చలసాని వెంకటరత్నం, కొండేటి చందు, మట్టా సతీష్, అంగడాల నగేష్, పెనుమత్స ఏసురత్నం తదతరులు వెళ్లారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: దెందులూరులో శనివారం నిర్వహించిన సిద్ధం బహిరంగసభకు మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి సభకు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: దెందులూరులో జరిగే సిద్ధం సభకు మండలంలోని పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఎమ్మెల్య కైలే అనిల్‌కుమార్ సభకు వెళ్లిన వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం నుంచి వేలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు శనివారం దెందులూరు 'సిద్ధం' మహాసభకు బస్సుల్లో స్వచ్ఛందంగా వెళ్లారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శాయన రవి, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషం గోపి, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు, ఎంపీటీసీ మండా దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


పామర్రులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సిద్ధం సభకు బయలుదేరిన నాయకులు


గుడివాడలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


మండవల్లి నుంచి సిద్ధం సభకు వెళుతున్న బస్సులను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ వీర్రాజు


గుడివాడ మండలంలో బస్సులను ప్రారంభిస్తున్న జాన్ విక్టర్, జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ


కైకలూరు నుంచి ముస్లిం యువత బైక్ ర్యాలీ


గుడివాడలో బస్సులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు శశిభూషణ్


తోట్లవల్లూరు మండలం దేవరపల్లిలో బస్సును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు


పమిడిముక్కల మండలం హనుమంతపురంలో బస్సులను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు


మొవ్వ మండలం భట్లపెనుమర్రు నుంచి వెళుతున్న ఎంపీపీ, నాయకులు


గుడ్లవల్లేరు నుంచి బస్సుల్లో బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మెల్యే కొడాలి నానీని కలిసిన సివిల్ సప్లైస్ డీఎం



గుడివాడ టౌన్: కృష్ణాజిల్లా సివిల్ సప్లైస్ డివిజనల్ మేనేజర్ తోట వెంకటసతీష్ శనివారం ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నానీ)ని మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని కొడాలి నానీ నివాసంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. నూతనంగా గుడివాడకు బదిలీ అయిన సందర్భంలో ఎమ్మెల్యేను కలిసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ కార్యక్రమాలు విజయవంతంగా ప్రజలకు అందేలా బాధ్యతలు నిర్వహించాలని కోరామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



పామర్రు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పరామర్శించారు. స్థానిక గుడివాడ రోడ్డులోని అండర్ పాస్ వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక శృతి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. క్షతగాత్రులు కొమరవోలు గ్రామానికి చెందిన వారు. వీరిని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, కొమరవోలు పీఏసీఎస్ అధ్యక్షుడు శింగవరపు రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు నాగ మల్లేశ్వరరావు, పార్టీ నాయకుడు శివయ్య పరామర్శించారు.

అందరి భాగస్వామ్యంతో పట్టణాభివృద్ధి



గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలో పట్టణాభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణాభివృద్ధి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించి పరిశుభ్రతలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు వస్తున్న పథకాలు అందించడంలో, సమస్యల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ప్రజలు నేరుగానైనా, స్పందన ద్వారా గాని తమ సమస్యలను తెలపవచ్చని పేర్కొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జీల బృందం

కై కలూరు: స్థానిక సబ్‌జైలులో ఖైదీలకు అందుతున్న పౌరసేవలపై కృష్ణాజిల్లా మచిలీపట్నం న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ కృష్ణయ్య శనివారం తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న భోజన సౌకర్యాలు, గదులను పరిశీలించారు. ఖైదీల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ.లక్ష్మి, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.శివకిరణ్, జైలు సూపరిండెంటెంటు బొత్స సత్యనారాయణ, పేనల్ న్యాయవాదులు పి.పవన్‌కాంత్, పి.ప్రసన్నకుమార్, పారాలీగల్ వలంటీరు సీహెచ్.వేణుబాబు పాల్గొన్నారు.


కైకలూరు సబ్‌జైలులో సూపరింటెండెంటు నుంచి వివరాలు తెలుసుకుంటున్న జడ్జీలు

బ్యాడ్మింటన్‌లో భద్రిరాజుపాలెం మహిళల ప్రతిభ

తోట్లవల్లూరు: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా మండలంలోని భద్రిరాజుపాలెంకు చెందిన మహిళలు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో భద్రిరాజుపాలెం మహిళలు మండేపూడి నాగమల్లీశ్వరి, బొంతు ఉషారాణి మంచి ప్రతిభను కనబరచి ద్వితీయ బహుమతిని సాధించారు. గన్నవరం ఎంపీపీ అనగాని రవి చేతుల మీదుగా ట్రోఫీ, మెడల్స్, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించిన నాగమల్లీశ్వరి, ఉషారాణిని ఎంపీడీఓ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు అభినందించారు.


గెలుపొందిన ట్రోఫీతో నాగమల్లీశ్వరి, ఉషారాణి

మండలాభివృద్ధికి కృషి చేయండి

ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

పమిడిముక్కల: ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు వేయాలని వైద్య, విద్యాశాఖలకు సూచించారు. సమావేశానికి హాజరు కాని శాఖలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రబీ పంటకు ఈ క్రాప్ చేస్తున్నామని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. డీటీ యేసుపాదం మాట్లాడుతూ ఎన్నికలకు 28 గ్రామాల్లో 59 పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేశామన్నారు. ఇళ్ల పట్టాలు పొందిన 2,260 మంది లబ్ధిదారులకు సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లకు విద్యుత్ లైన్లు వేస్తున్నామని, 24 గంటల విద్యుత్ సరఫరా ఇస్తామని తెలిపారు. వైద్యాధికారి బాలాజీ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, పీఆర్ ఏఈ శరాబందిరాజు, హౌసింగ్ ఏఈ భవానీ ప్రసాద్, ఏఓ రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

క్రీడాకారుల నైపుణ్యం పెంపుదలకు కృషి


షటిల్ పోటీల్లో విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఖో-ఖో పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో మున్సిపల్ కమిషనర్


క్రికెట్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మచిలీపట్నం జట్టు

మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: క్రీడలు మానసిక స్థైర్యంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల ముగింపు అనంతరం శనివారం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసి క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఖో-ఖో మహిళ, పురుషుల విభాగాల్లో జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమస్థానం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు మడకా ప్రసాద్, ఏసురత్నం పాల్గొన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో ఏజీకే మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి మొదటి స్థానం కై వసం చేసుకోవడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పీఎల్ నర్సమాంబ తెలిపారు. పాఠశాలకు చెందిన ఎస్. వర్షిణి, హైని మేఘన పోటీలో విజయం సాధించారన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పురుషుల విభాగం క్రికెట్ పోటీల్లో మచిలీపట్నం జట్టు పెడన జట్టుపై విజయం సాధించి ప్రథమస్థానం కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెడన: మండలంలోని బలిపర్రులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినిల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్కూలు ప్రిన్సిపాల్ ఎన్. రూతమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తును హెచ్‌టీటీపీఎస్//ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ ద్వారా ఆసక్తిగల విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి పదో తేదీ ఉదయం పది నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి వారికి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. గాంధీ నగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం జేఎంఎస్ సరాగాలు ఆధ్వర్యాన సినీ సంగీత విభావరి, విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజుకు ఘన సన్మానం, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ కళారంగంలోని వారు చేస్తున్న సేవలను గుర్తించాలన్నారు. జేఎంఎస్ సరాగాలు వ్యవస్థాపకురాలు ఝాన్సీ సంస్థ లక్ష్యాలను వివరించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ మాట్లాడుతూ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలిపారు. అనంతరం విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు గాయకులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చిట్టిబాబు, వీరభద్రరావు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా నిర్మల జ్యోతి

కలిదిండి: కలిదిండి మేజర్ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా కె.నిర్మల జ్యోతి శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం గ్రామానికి చెందిన ఆమెకు కారుణ్య నియామకంలో ఈ ఉద్యోగం వచ్చినట్లు తెలిపారు.